సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 17 । నవంబర్ । 2024



ప్రభుత్వ రంగంలోనే 'విశాఖ స్టీల్‌ప్లాంట్' 8లో



కదంతొక్కిన అంగన్‌వాడీలు 8లో



తండ్రి కళ్లముందే మృత్యు ఒడికి.. 8లో

• ఓహో పావురమా..!



ఏయూక్యాంపస్: కడలి కెరటాలు ఒకవైపు.. కపోతాల సమూహం మరోవైపు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్.కె.బీచ్‌కు వందలాది పావురాలు వస్తుంటాయి. పర్యాటకులు వేసే గింజలు, ఆహార పదార్థాలను తినేసి ఎగిరిపోతుంటాయి. రివ్వున ఎగిరే పావురాల గుంపును పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. నగరవాసులు, పర్యాటకులకు ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కైలాసగిరిపై స్కై సైక్లింగ్

ఆరిలోవ: కైలాసగిరి శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో పర్యాటకులు కైలాసగిరిని సందర్శించి, శివ పార్వతుల విగ్రహాల వద్ద ఫొటోలు దిగారు. కాగా.. ఇక్కడ ఏర్పాటు చేసిన స్కై సైక్లింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం స్కై సైక్లింగ్ ట్రయల్‌రన్ కొనసాగుతుండగా.. త్వరలోనే అందుబాటులోకి రానుంది. సుమారు 200 మీటర్ల పొడవైన తీగలపై గాల్లో తేలుతూ కైలాసగిరి కొండ చుట్టూ ఉన్న అందాలను తిలకించవచ్చు. పచ్చదనం, నీలి సముద్ర తీరం, ఎత్తైన భవనాలు చూడొచ్చు. ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



బీచ్‌రోడ్డులోని కురుసుర సబ్‌మెరైన్ విద్యుత్ వెలుగుతో జిగేల్‌మంటోంది. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. రంగురంగు దీపాలతో సందర్శకుల మనసు దోచుకుంటోంది. -ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు



పిఠాపురం కాలనీలో దుకాణాలను ట్రాలర్‌పైకి ఎక్కిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

రోడ్డున పడిన చిరు బతుకులు

'సారూ.. ఈ దుకాణాలే మాకు జీవనాధారం. వీటిని తొలగిస్తే రోడ్డున పడతాం. మాకు బతుకే లేకుండా పోతుంది.. అద్దెలు చెల్లిస్తున్నాం.. జీవీఎంసీకి పన్నులు కడుతున్నాం. అకస్మాత్తుగా ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మంటే ఎలా బతుకుతాం'అని చిరు వ్యాపారులు ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదు. కాళ్లావేళ్లా పడి వద్దన్నా.. వ్యాపారుల వేదనను అర్థం చేసుకోలేదు. వందలాది కుటుంబాల ఆశలు, ఆకాంక్షలు ఈ దుకాణాలతోనే ముడిపడి ఉన్నాయి. కానీ ఒక్కసారిగా వారి ప్రపంచం నాశనమైంది. దాదాపు 400 మంది జీవీఎంసీ సిబ్బంది, పోలీసులు క్రేన్లతో వారి దుకాణాలను కూల్చివేసి లారీలు, ట్రాలర్లలో పట్టుకెళ్లిపోయారు. ముందస్తు సమాచారం లేకుండా వారి జీవితాలను అస్తవ్యస్తం చేశారు. జనసేన కార్పొరేటర్ తీరుతో తమ జీవితాలు అంధకారంలోకి వెళ్లిపోయాయని చిరు వ్యాపారులు ఆరోపించారు. – బీచ్‌రోడ్డు

- ఎటువంటి సమాచారం లేకుండా దుకాణాల తొలగింపు
- కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఇంటి ముట్టడికి వ్యాపారుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు

జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురంకాలనీ, పీతవానిపాలెం ప్రాంతాల్లోని తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల దుకాణాలను శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వందల సంఖ్యలో పోలీసులు రంగంలోకి దిగి.. చిరు వ్యాపారులను అడ్డుకున్నారు. 22వ వార్డులో చిరు వ్యాపారాలతో అత్యవసర పరిస్థితుల్లో అంతరాయం కలుగుతోందని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో కేసు వేయగా.. అతనికి అనుకూలంగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ టౌన్ ప్లాన్ సిబ్బంది వ్యాపారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా శనివారం తెల్లవారుజామున చర్యలకు ఉపక్రమించారు. ఈ సమాచారం తెలుసుకున్న చిరు వ్యాపారులు తమ దుకాణాల వద్దకు చేరుకుని.. జీవీఎంసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. హైకోర్టు ఆదేశాల మేరకు దుకాణాలు తొలగిస్తున్నామని అధికారులు తెలపగా. తమకు ఇదే బతుకుదెరువని.. దుకాణాలు తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ప్రాధేయపడ్డారు. అయినప్పటికీ క్రేన్లతో షాపులను తొలగించి లారీలపై ఎక్కించి తరలించారు. పొక్లెయిన్లతో మరి కొన్ని దుకాణాలను ధ్వంసం చేశారు.

ప్రైవేట్ స్థలంలోని షాపులను కూడా..

టౌన్ ప్లానింగ్ అధికారులు అత్యుత్సాహంతో ప్రైవేట్ స్థలంలోని షాపులను కూడా తొలగించారు. ప్రైవేట్ స్థలంలో ఐదుగురు వ్యాపారులు అద్దె చెల్లిస్తూ షాపులను నడుపుతున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా వీటిని కూడా సిబ్బంది నేల మట్టం చేశారు. తమ షాపులు ప్రైవేట్ స్థలంలో ఉన్నాయని, సమయం ఇస్తే డాక్యుమెంట్లు చూపిస్తామని చెప్పినా అధికారులు, సిబ్బంది వినలేదు. వాటి లోపల ఉన్న సామాన్లు బయటకు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా.. ధ్వంసం చేయడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు.

పీతల మూర్తి డౌన్ డౌన్

తమ బతుకులు కూల్చేశారన్న ఆగ్రహంతో చిరు వ్యాపారులు పీతల మూర్తి డౌన్ డౌన్.. పీతల మూర్తిని వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలతో వార్డులో ర్యాలీ చేశారు. వారికి మద్దతుగా స్థానికులు నిలిచారు. ఈ క్రమంలో మూర్తి యాదవ్ ఇంటిని ముట్టడించే ప్రయత్నం చేయగా.. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని వ్యాపారులను అడ్డుకున్నారు. ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేశారు. అయినా సరే చిరువ్యాపారులు వెనక్కి తగ్గకుండా పీతలవానిపాలెం జంక్షన్ లో మూర్తి యాదవ్ ఆరాచకాలు నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ ప్రదర్శన చేపట్టారు. మూర్తి యాదవ్ బ్యానర్లకు చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా వార్డులో ఎప్పుడు.. ఎవరి షాపులను కూల్చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రైవేట్ స్థలంలోని షాపును తొలగించారు



నేను 28 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నా. గతేడాది రోడ్డు విస్తరణ చేయడంతో నా షాపును తొలగించారు. నేను ప్రస్తుతం రోడ్డుకు అనుకుని ఉన్న ప్రైవేట్ స్థలంలో అద్దె చెల్లిస్తూ షాపును నడుపుతున్నా.. నాకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఉదయాన్నే షాపును నేలమట్టం చేశారు. స్థలం యాజమాని పత్రాలను తీసుకొని వస్తాను కాసేపు వేచి ఉండమని చెప్పినా అధికారులు వినలేదు. షాపులోని కస్టమర్ల బైక్‌లు ఉన్నాయి. అవి కూడా దెబ్బతిన్నాయి. షాపుపైనే నా కుటుంబం మొత్తం ఆధారపడి ఉంది. మేమంతా రోడ్డు మీద పడ్డాం.

– సుధాకర్, బైకు మెకానిక్ షాపు

వ్యాపారం చేసుకోనివ్వడం లేదు



కొన్ని నెలలుగా మాకు వ్యాపారం చేసుకోనివ్వడం లేదు. ఎప్పుడు షాపులను తొలగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారం ఇవ్వకుండానే దుకాణాలను నేలమట్టం చేస్తున్నారు. చిరు వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న మాపై ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణం.

– ఆదిలక్ష్మి, టీ షాపు

కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

జీవీఎంసీ 22వ వార్డులో జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారుల దుకాణాలు, తోపుడుబండ్లను అక్రమంగా తొలగించడాన్ని సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఖండించింది. ఈ చర్యలకు పూనుకున్న జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చిరువ్యాపారులకు ఉపాధి రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చిరు వ్యాపారులతో కలిసి కళాభారతి నుంచి మూర్తి ఇంటి వరకు సీపీఎం నాయకులు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కష్ణారావు మాట్లాడుతూ కళాభారతి రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని చెప్పి.. 30 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్న వారి దుకాణాలు తొలగించడం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎక్కడవారికి అక్కడ హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని, ఐడీ కార్డులు ఇచ్చి ఉపాధికి రక్షణ కల్పించాలన్నారు. వీరికి ఆ సౌకర్యాలేవి కల్పించకుండా దుకాణాలను తొలగించారని మండిపడ్డారు. చిరు వ్యాపారస్తులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, లేకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులు, స్థానికులు

న్యాయవాద వృత్తిలో నైతిక విలువలు ముఖ్యం



సమావేశంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి, ఇతర ప్రముఖులు

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి

విశాఖ లీగల్: న్యాయవాద వృత్తిలో రాణించడానికి నైతిక విలువలు ముఖ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల గ్రంథాలయంలో ప్రముఖ న్యాయవాది దివంగత సి.పద్మనాభరెడ్డి స్మారక ఉపన్యాసానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. న్యాయశాస్త్రానికి సంబంధించి తీర్పులు, ఇతర జడ్జిమెంట్లు, చట్ట సమాచారం అతి సులభంగా లభ్యమవుతాయి కానీ నైతిక విలువలు ఎక్కడి నుంచి లభ్యం కావన్నారు. నైతికతకు విలువలకు నిలువెత్తు రూపం పద్మనాభరెడ్డిగా విపులకరించారు. పద్మనాభ రెడ్డి కుమారుడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తన తండ్రి బాటలో నడుస్తూ సమాజానికి ఓ మంచి సందేశాన్ని ఇచ్చారన్నారు. ప్రతి న్యాయవాది తమ జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగేశ్వరావు మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయమూర్తులు మధ్య సత్సంబంధాలు మంచి తీర్పులకు దారితీస్తాయన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పద్మనాభ రెడ్డి నుంచి వృత్తి ధర్మంతో పాటు నైతిక విలువలను నేర్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు అజయ్‌కుమార్, ఎం.ఎస్.భగవతి, కె.రామజోగేశ్వరరావు, ఎస్.కృష్ణమోహన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు నర్సింగరావు భారీ సంఖ్యలో న్యాయవాదులు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

రాణి చంద్రమణి దేవి ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: పెదవాల్తేరు పరిధిలోని రాణి చంద్రమణి దేవి ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులతో కాసేపు మాట్లాడారు. వైద్యాధికారులు, సిబ్బంది వ్యవహార శైలి, వైద్య సహాయంపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో కలియ తిరిగారు. అక్కడ పరిస్థితులను, వైద్యుల హాజరు పట్టీ, ఇతర రికార్డులను పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులకు, రోగులకు అందించే పరికరాలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి పట్ల ప్రేమగా మెలగాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

రూ. 65 కోట్ల విలువైన భూమి స్వాధీనం



దేవస్థానం భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: నగరంలోని సీతమ్మధార సర్వే నంబర్ 275లో ఉన్న 10 ఎకరాలు, 4,460 గజాల భూమిని సింహాచలం దేవస్థానం అధికారులు శనివారం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపిన వివరాలివీ.. సర్వే నంబర్ 275లో ఒక చోట 10 ఎకరాలు, మరో చోట 4,460 గజాల భూములు దేవస్థానానికి చెందినవని రాష్ట్ర

మిగతా 8వ పేజీలో ▶

రింగ్ వలలపై హైకోర్టు ఆదేశాలు పాటించాలి

మహారాణిపేట: రింగ్ వలలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రతి ఒక్కరు పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ మయూర్ అశోక్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంప్రదాయ మత్స్యకారులు, రింగ్ వలల మత్స్యకారులతో జేసీ సమావేశం ఏర్పాటు చేశారు. హైకోర్టు ఆర్డర్, మత్స్యకారుల సంఘాల నాయకులు చెప్పినవన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దని, శాంతి భద్రతల సమస్యలను ఎవరు సృష్టించవద్దన్నారు. మెరైన్ ఎస్పీ రవివర్మ రింగ్ వలల సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఫిషరీస్ జేడీ లక్ష్మణరావు, మెరైన్ డీఎస్పీ బాలరాజు, హార్బర్ ఏసీపీ కాళిదాసు, ఇన్‌చార్జి ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సంప్రదాయ మత్స్యకారులు (కొత్త జాలారిపేట) చింతపల్లి అయ్యప్పరాజు, ఓలిశెట్టి తాతాజీ, కాసారపు వాసు, చింతపల్లి పోతురాజు, చింతపల్లి జోగురాజు నొల్లు పోతురాజు, పెదజాలారిపేట నుంచి పిల్లా నూకన్న, పొట్టి అప్పన్న, తెడ్డు శంకరరావు, రింగు వలలు నుంచి మత్స్యకారులు(జాలరి ఎండాడ నుంచి) తెడ్డు గురుమూర్తి, తెడ్డు రామారావు, ఉప్పిలి ప్రసాద్, ఉప్పిలి పాలరాజు, ఉప్పిలి పాలారావు హాజరయ్యా రు. తొలుత సంప్రదాయ మత్స్యకారులతో సమావేశమయ్యారు. వలిసెట్టి తాతాజీ మాట్లాడుతూ రింగ్ వలలతో వేటకు వెళ్లి 20 నుంచి 30 టన్నులు చేపలు తెస్తున్నారని, దీంతో సంప్రదాయ మత్స్యకారులు వలలకు చేపలు చిక్కడం లేదన్నారు. తెడ్డు శంకర్ మాట్లాడుతూ ప్రతీ సారి పోలీసులు తమకు 41 నోటీసులు ఇస్తున్నారని, ఇప్పుడు రింగ్‌వలతో మళ్లీ వేటకు వెళ్తున్నారని, సమస్యను అధికారులే పరిష్కరించాలన్నారు.



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

తండ్రి కళ్లముందే మృత్యు ఒడికి..

- తండ్రి వెంట పరుగులు తీసి బస్సు ఢీకొనడంతో దుర్మరణం
- అగనంపూడి జాతీయ రహదారిపై ఘోర సంఘటన
- శోకసంద్రంలో తల్లిదండ్రులు, బంధువులు


మృతుడు పవన్ కుమార్ (ఫైల్)


ప్రమాదానికి కారణమైన బస్సు

అగనంపూడి: ఇక్కడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం అందరినీ కన్నీరు పెట్టించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న ఏడేళ్ల కుమారుడు కళ్లముందే ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న దేముళ్లు, భార్య దేవి, కుమార్తె వెంకటి, కుమారుడు పవన్‌కుమార్ స్థానిక బీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీకి సమీపంలోనే సాధన పబ్లిక్ స్కూల్‌లో పవన్ 2వ తరగతి, ప్రభుత్వ పాఠశాలలో కుమార్తె 7వ తరగతి చదువుతోంది. ఎప్పట్లాగే కుమారుడు పవన్‌ను దేముళ్లు పాఠశాల వరకు తీసుకెళ్లారు. లోపలకు వెళ్లిపొమ్మని చెప్పి అక్కడి నుంచి పరవాడ ఫార్మా కంపెనీకి వెళ్లేందుకు బస్సు కోసం ఆయన జాతీయ రహదారి దాటుతుండగా కుమారుడు వెంట పడ్డాడు. అదే సమయంలో లంకెలపాలెం నుంచి గాజువాక వైపు వస్తున్న ఫార్మా కంపెనీ బస్సు పవన్‌ను ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. అప్పటి వరకు తనతో కలిసి ఉన్న కుమారుడు కళ్లెదుటే ప్రాణాలు కోల్పోవడంతో తండ్రి దేముళ్ల తట్టుకోలేక పోయాడు. గుండెలివిసేలా రోదించాడు. కుమారుడు మరణవార్త తెలుసుకున్న తల్లి దేవి గుండెలు బాదుకుంటూ సంఘటన స్థలం వద్ద విలపించడం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. బంధువులు బోరున విలపించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దువ్వాడ సీఐ కిల్లి వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబం సొంతూరు చోడవరం మండలం లక్కవరం పంచాయతీలోని మామిడిపల్లి గ్రామమని బంధువులు తెలిపారు.

జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఏయూ విద్యార్థులు


విద్యార్థులతో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకానికి చెందిన 10 మంది విద్యార్థులు జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో జరిగే శిక్షణ కార్యక్రమానికి వీరు హాజరవుతారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఏయూ ఉపకులపతి ఆచార్య జి. శశిభూషణ రావు శనివారం అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ పల్లవి పాల్గొంటారు. రెక్టార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

బాధితురాలికి సీపీ పరామర్శ

గాజువాక : ప్రేమోన్మాది నీరజ్ శర్మ చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు మేఘనను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితురాలి బంధువులతో మాట్లాడారు. దాడి చేసిన నిందితుడిని వీలైనంత త్వరలో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిందితుడి పట్టుకోవడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బాధితురాలిని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. నిందితుడినుంచి ఎటువంటి హాని తలెత్తకుండా భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పెదగంట్యాడ నిర్వాసిత కాలనీ బాలచెరువు గ్రామంలో నివాసముంటున్న మేఘనపై నీరజ్ శర్మ విచక్షణా రహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడ్డ ఆమె ప్రస్తుతం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

పరవాడ ఎస్‌ఐ సస్పెన్షన్

పరవాడ: పరవాడ ఎస్‌ఐ రామారావు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రామారావు పనిచేసిన నాతవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో తాండవ జంక్షన్‌లో ఒక భూ వివాదంలో చేతివాటం చూపించి సాక్ష్యాలు తారుమారు చేశారన్నా ఆరోపణలు నేపథ్యంలో నర్సీపట్నం డివిజనల్ పోలీస్ అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో విచారణ చేశారు. ఆ నివేదిక ఆధారంగా డీఐజీ గోపినాథ్ జట్టీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ రంగంలోనే 'విశాఖ స్టీల్‌ప్లాంట్'

నినదించిన విద్యార్థులు

సీతమ్మధార: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే ప్రక్రియను తక్షణం నిలిపివేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా 32వ జిల్లా మహాసభలు పురస్కరించుకుని శనివారం జీవీఎంసీ పరిసర ప్రాంతాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జైల్ రోడ్, అంబేద్కర్ సర్కిల్, ఎల్ఐసీ బిల్డింగ్ చుట్టూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ బాబు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమష్టిగా పోరాడతామని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 18 యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. శ్రీను, యు. నాగరాజు మాట్లాడుతూ ఆదివారం ఏయూ టీ.ఎల్.ఎన్ హాల్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు కిరణ్, గ్రేస్ ప్రకాష్, పురుషోత్తం, శేఖర్, సింహాచలం ,హేమానంద్ , భవాని, సోనియా, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేవీ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

మల్కాపురం: ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన డబ్బుల పంపకం విషయంలో మనస్తాపానికి గురై.. విశ్రాంతి నేవీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. బిహార్ రాష్ట్రానికి చెందిన సందీప్ కుమార్ యాదవ్(35) రెండేళ్ల నుంచి జీవీఎంసీ 60వ వార్డు పరిధి శ్రీహరిపురం సమీపంలోని జవహర్‌నగర్‌లోని అద్దె ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నారు. సందీప్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయగా.. వచ్చిన డబ్బుల్లో కొంత మొత్తాన్ని తల్లిదండ్రులకు ఇవ్వాలని భావించారు. ఇందుకు అతని భార్య వ్యతిరేకించడంతో అటు తల్లిదండ్రులకు, ఇటు భార్యకు చెప్పుకోలేక మదనపడ్డాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చాలాసేపటి వరకు గది నుంచి భర్త రాకపోవడంతో భార్య కిటికీ నుంచి చూసింది. ఫ్యాన్ వేలాడుతున్న అతన్ని చూసి కేకలు వేసింది. స్థానికుల సమాచారం మేరకు మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో క్రైస్తవులపై దాడులను ఖండిస్తున్నాం..

న్యూఢిల్లీ ఏడీఎఫ్ ఇండియా స్ట్రాటజిక్ లిటిగేషన్ సుప్రీం కోర్ట్ న్యాయవాదులు


వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీని సన్మానిస్తున్న క్రైస్తవ మైనారిటీ కౌన్సిల్

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను న్యూఢిల్లీ ఏడీఎఫ్ ఇండియా స్ట్రాటజిక్ లిటిగేషన్ సుప్రీంకోర్ట్ న్యాయవాదులు సెంబా మొరాంగ్, రోబిన్ క్రిస్టోఫర్ ఖండించారు. ఈనెల 12వ తేదీన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో చింతా డేవిడ్ రాజారెడ్డిపై అక్రమంగా నాన్ బెయిల్‌బుల్ సెక్షన్లు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించారని వాపోయారు. శనివారం గురుద్వార్ సమీపంలో గల క్రైస్ట్ చర్చ్‌లో క్రిస్టియన్ మైనారిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ, క్రైస్తవ నాయకులు ఎం.సుధాకర్, జేమ్స్ కుంపట్ల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. క్రైస్తవుల ఆస్తుల పరిరక్షణ, నిర్వహణ, క్రైస్తవులపై జరుగుతున్న దాడుల విషయమై చర్చించారు. ఇటీవల కొన్ని ఇతర మత సంస్థలు చర్చ్‌లపై సర్వే చేయడం, చర్చ్ నిర్మాణ పర్మిషన్, నిర్వహణ విషయంలో ప్రైవేట్ పోలీసింగ్ చేస్తూ వెంబడించడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం వల్ల క్రైస్తవ మైనార్టీలు అభద్రతకు గురవుతుండడం వంటి అంశాలపై న్యాయవాదులతో చర్చించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని.. ఆ సమయాల్లో బాధిత క్రైస్తవులకు అండగా క్రైస్తవ లీగల్ టీం మద్దతునివ్వాలని తీర్మానం చేశారు.

రూ. 65 కోట్ల విలువైన భూమి స్వాధీనం

▶7వ పేజీ తరువాయి

హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ ఆక్రమణదారులు మళ్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ రిట్ పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు డిస్మిస్ చేసింది. న్యాయపరమైన అడ్డంకులు తొలగడంతో ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు ఈవో తెలిపారు. ఈ భూముల విలువ రూ.65 కోట్లు ఉంటుందని వెల్లడించారు. ఈ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని.. ఎవరైనా ఆక్రమణకు యత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు. దేవస్థానం భూపరిరక్షణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలి, స్పెషల్ లీగల్‌సెల్ న్యాయవాది ఎన్‌వీఎస్ ప్రసాద్ వర్మ, దేవస్థానం న్యాయ విభాగం ఏఈవో వి.బి.వి.రమణ మూర్తి, ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్, ఈఈలు శ్రీనివాస రాజు, రాంబాబు, డీఈ హరి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల క్రీడా పోటీలు వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొనున్నారు. కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణం వేదికగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మినిస్ట్రేషన్) జీవీ రవివర్మ పలువురు ఆర్టీసీ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలతో శనివారం ఎంవీపీ బస్ స్టేషన్ ఈడీ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. వివిధ రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థల నుంచి విచ్చేస్తున్న క్రీడాకారులకు రవాణా, వసతి, ఆహార, క్రీడా ప్రాంగణ, మెడికల్, భద్రత ఏర్పాట్లు చేయాలని ఆయా కమిటీలను ఆదేశించారు. సమావేశంలో జోన్–1 ఇన్‌చార్జ్ ఈడీ విజయకుమార్, సీఎంఈ(ఎం) జి.విజయరత్నం, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి, విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

విజయం సాధించే వరకు విశ్రమించొద్దు

డీఎస్సీ అభ్యర్థులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: పోటీ పరీక్షల్లో విజయం సాధించే దిశగా ప్రిపరేషన్ సాగాలని ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. ఎంవీపీకాలనీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడి చదివితే సానుకూల ఫలితాలు వస్తాయని, ఆ దిశగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సమయాన్ని వృథా చేయవద్దని హితవు పలికారు. శిక్షణ కాలంలో 75శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్, డీఎస్సీ మెటీరియల్ కోసం రూ.1,000 అందజేస్తామన్నారు. నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ప్రిపరేషన్ కొనసాగించాలని, వర్తమాన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, అంకితభావం ఎంతో అవసరమన్నారు. అనంతరం కలెక్టర్ బీసీ స్టడీసర్కిల్ లోని వివిధ విభాగాలను సందర్శించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, బోధకులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వివాదంలో నలుగురి అరెస్ట్

మధురవాడ: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తలెత్తిన వివాదం కారణంగా ఓ వ్యక్తిపై ఇద్దరు కుటుంబ సభ్యులు, మరో ఇద్దరు కలిసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు పీఎంపాలెం ఎస్ఐ బాలకృష్ణ చెప్పారు. బాధితుడు చంద్రశేఖర్‌తో వ్యాపార లావాదేవీల్లో వివాదం తలెత్తడంతో ప్రధాన నిందితుడు పేరూరు సోమశేఖర్, వంక గోపాలకృష్ణ, ఆకుల కళావతి, బోరా కనకమహాలక్ష్మి దాడికి పాల్పడ్డారు. గురువారం సాయంత్రం బాధితుడు చంద్రశేఖర్ పెందుర్తి నుంచి బయలుదేరగా.. నిందితులంతా కారులో వెంబడించారు. 8.30 నుంచి 9 గంటలు మధ్యలో పీఎంపాలెం తులసీనగర్ రోడ్డులోకి చేరుకునే సరికి కారుతో ఢీకొట్టారు. దీంతో చంద్రశేఖర్ కారులోంచి కింద పడిపోయాడు. వెంటనే ఇనుప రాడ్డుతో కొట్టారు. సమీపంలో ఓ చెట్టుకు కట్టి.. దారుణంగా దాడి చేసి అక్కడ నుంచి పరారయ్యారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు బాలకృష్ణ చెప్పారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- బడ్జెట్‌లో అంగన్‌వాడీలకు అన్యాయం
- ధర్నాలో సీఐటీయూ నేతలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

సీతమ్మధార: అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని, 42 రోజుల సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు, ఉత్తర్వులు విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు అవుతున్నప్పటికీ.. అంగన్‌వాడీలకు మేలు జరిగేలా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ గురించి ప్రస్తావన రాలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చే జీవో కూడా ఇవ్వకపోవడం బాధాకరమని శర్మ అన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చి, ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలన్నారు. ధర్నాలో ఐద్వా ఆల్ ఇండియా కార్యదర్శి ఎస్.పుణ్యవతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటలక్ష్మి, దేవి, యూనియన్ గౌరవ సలహాదారు బృందావతి, కోశాధికారి కె.పద్మావతి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శోభారాణి, యూనియన్ జిల్లా నాయకులు నర్సిమ్మ, కృపారాణి, సరస్వతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కాల్ ఫ్రాడ్ కేసులో నిందితుల అరెస్ట్

ఢిల్లీ కేంద్రంగా ముఠా ఆపరేటింగ్

అల్లిపురం: తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య శ్రీ కాల్ ఫ్రాడ్ కేసులో ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్న ముఠా సభ్యులను సైబర్ క్రైం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత డైరీ ఫారమ్‌కు చెందిన రఘుపాత్రుని వరలక్ష్మి అకౌంటెంట్‌గా పనిచేస్తుంది. ఈ ఏడాది జూన్ 28వ తేదీన ఆమెకు గుర్తు తెలియని వ్యక్తి ఆరోగ్య శ్రీ నుంచి అంటూ ఫోన్ చేశాడు. మీ కోడలి డెలివరీ ఖర్చుల కింద ఆరోగ్య శ్రీ ద్వారా రావాల్సిన డబ్బులు చెల్లించడానికి కొంత ఆన్‌లైన్ ప్రాసెస్ ఉందని సంబంధించిన లింక్ పంపించాడు. లింక్ ఉపయోగించి బ్యాలెన్స్ తనిఖీ చేసుకోమని చెప్పాడు. ఆమె లింక్‌పై క్లిక్ చేయగానే ఆమె ఖాతా నుంచి రూ.26,211 డెబిట్ అయ్యాయి. ఆ మొత్తంపై ఆమె ప్రశ్నించగా నిందితుడు ఆమె ఫోన్ పే మరోసారి తనిఖీ చేయాలన్నాడు. తనిఖీ చేసి చూడగా మరో రూ.51,201 కట్ అయినట్లు గుర్తించింది. మళ్లీ ప్రశ్నించగా మరోసారి చెక్ చేసుకోమని చెప్పాడు. మరో రూ.6,831 కట్ అయినట్లు గుర్తించింది. దీంతో ఆమె మోసపోయానని గ్రహించింది. మొత్తం ఆమె ఖాతా నుంచి రూ.84,243 కోల్పోయింది. అదే విధంగా గాజువాక పెదనడుపూరుకి చెందిన యెన్ని శశికళ తన ఖాతా నుంచి రూ.99,342 కట్ అయినట్లు గుర్తించారు. మద్దిలపాలెం చైతన్య నగర్‌కు చెందిన బోయి దివ్య నిందితుల మోసంలో పడి తన ఖాతా నుంచి రూ.99,430 నష్టపోయింది. మొత్తం ముగ్గురు బాధితులు కలిపి రూ.2,83,015 నష్టపోయారు. ఈ విధంగా నిందితుల నుంచి ఆన్‌లైన్‌లో మోసానికి పాల్పడిన నిందితులు కాకాని నరేంద్ర, శివరాత్రి కార్తీక్, పాలూరి ప్రసాద్‌లను నగర సైబర్ క్రైం పోలీసులు ఢిల్లీలో అరెస్ట్ చేశారు. వారిని స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై నగరానికి తీసుకువచ్చి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.